ఆస్ట్రేలియా X పాకిస్థాన్
రా. 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

బ్రూక్, రూట్ శతక ధమాకా

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 823/7 డిక్లేర్డ్

ముల్తాన్(పాకిస్థాన్): ఇంగ్లండ్, పాకిస్థాన్ తొలి టెస్టులో రికార్డుల వెల్లువ కొనసాగుతున్నది. ముల్తాన్ పిచ్‌పై ఇరు జట్ల బ్యాటర్లు పరుగుల వరద పారిస్తున్నారు. ఓవర్‌నైట్ స్కోరు 492/3 నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లండ్ 823/7 వద్ద డిక్లేర్ చేసింది. హ్యారీ బ్రూక్(322 బంతుల్లో 317, 29ఫోర్లు, 3సిక్స్‌లు), జోరూట్(375 బంతుల్లో 262, 17ఫోర్లు) శతక గర్జన చేశారు. వీరిద్దరు పాక్ బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ రికార్డులు కొల్లగొట్టారు. టెస్టు క్రికెట్ చరిత్రలో బ్రూక్..రెండో వేగవంతమైన ట్రిపుల్ సెంచరీతో చెలరేగితే రూట్..తన కెరీర్‌లో ఆరో డబుల్ సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. దీనికి తోడు టెస్టుల్లో ఒక జట్టు 800 స్కోరు చేయడం ఓవరాల్‌గా ఇది నాలుగోసారి కాగా, ఈ శతాబ్దంలో ఇది మొదటిది కావడం విశేషం. బ్రూక్, రూట్ కలిసి నాలుగో వికెట్‌కు 454 పరుగుల భాగస్వామం నెలకొల్పి జట్టుకు రికార్డు స్కోరు అందించారు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌కు దిగిన పాక్..152 పరుగులకు 6 వికెట్లు కోల్పోయింది. అట్కిన్సన్ (2/28), బ్రైడన్ కర్స్ (2/39) రెండేసి వికెట్లతో పాక్ పతనాన్ని శాసించారు. చేతిలో నాలుగు వికెట్లు ఉన్న పాక్..ప్రస్తుతం 115 పరుగుల వెనుకంజలో ఉన్నది.

భారత్‌కు కాంస్యం

ఏషియన్ టీటీ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: ఏషియన్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. గురువారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 0-3 తేడాతో చైనీస్ తైపీ చేతిలో ఓటమిపాలైంది. ఆఖరి ఆసక్తికరంగా సాగిన పోరులో దిగ్గజ టీటీ ప్లేయర్ కమల్ 7-11, 10-12, 9-11తో వరల్డ్ నంబర్7 లిన్ యున్ జుపై ఓటమి చవిచూశాడు. ఆ తర్వాత జరిగిన గేమ్‌లో మానవ్ ఠక్కర్ 9-11, 11-8, 3-11, 11-13తో కావో చెంగ్ జుయిపై ఓడాడు. మూడో రౌండ్‌లో హర్మీత్‌దేశాయ్ 6-11, 9-11, 7-11తో హువాంగ్ యన్ చెంగ్‌పై పరాజయంతో చైనీస్ తైపీ విజయం ఖరారైంది. ప్రతిష్ఠాత్మక టోర్నీలో భారత పురుషుల, మహిళల జట్ల ప్రదర్శన పట్ల జాతీయ టీటీ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది.

లక్ష్యసేన్ ఔట్

వాంటా(ఫిన్‌లాండ్): ఆర్క్‌టిక్ ఓపెన్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 21-19, 18-21, 15-21తో చో టీన్ చెన్(చైనీస్ తైపీ) చేతిలో ఓటమిపాలయ్యాడు. గంటా 10 నిమిషాల పాటు సాగిన పోరులో 23 ఏండ్ల లక్ష్యసేన్ స్థాయికి తగ్గ ఆటతీరు కనబర్చలేకపోయాడు. తొలిగేమ్‌ను 21-19తో గెలిచిన లక్ష్యసేన్..వరుస గేముల్లో ప్రత్యర్థికి తలొగ్గి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. మిగతా మ్యాచ్‌ల్లో కిరణ్ జార్జ్ 17-21, 8-21తో జొనాథన్ క్రిస్టి(ఇండోనేషియా) చేతిలో ఓడాడు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ 15-21, 8-21తో రచనోక్ ఇటానోన్‌పై ఓడగా, ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్ వేర్వేరు ప్రత్యర్థుల చేతుల్లో పరాజయం పాలయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీశ్‌కుమార్, కరుణాకర్ జోడీతో పాటు మహిళల డబుల్స్‌లో రుతుపర్ణ, స్వేత పర్ణ ద్వయం పోరాటం ముగిసింది.

క్లే కింగ్ బై బై

కెరీర్‌కు వీడ్కోలు పలికిన రఫెల్ నాదల్

డెవిస్ కప్ టోర్నీ ఆఖరిదని ప్రకటన.. గాయాలతో సతమతమవుతున్న స్టార్ ప్లేయర్

స్పెయిన్ బుల్‌కు సహచర ప్లేయర్ల అభినందన

యుగానికొక్కడు! పోరాటయోధుడు! అద్భుత ప్రతిభాశాలి! ఇలాంటి ఉపమానాలన్నీ అతనికే వర్తిస్తాయేమో! ఆట కోసమే పుట్టాడా అన్న రీతిలో మూడేండ్ల ప్రాయంలోనే రాకెట్ పట్టిన కుర్రాడు..ప్రపంచ టెన్నిస్‌ను శాసించిన వైనాన్ని ప్రశంసించేందుకు పదాలు కూడా వెతుక్కోవాల్సిందేమో! స్పెయిన్ బుల్‌గా టెన్నిస్ ప్రపంచాన్ని మకుటం లేని మహారాజుగా ఏలిన రఫెల్ నాదల్ అసమాన కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాల పాటు ప్రపంచ క్రీడాభిమానులను తన అద్భుత ఆటతీరుతో అలరించిన నాదల్..ఆటకు ఇక సెలవంటూ ప్రకటించాడు. డేవిస్ కప్ టోర్నీ ఆఖరిదంటూ ప్రకటన చేసి అభిమానులందరినీ ఆశ్చర్యపరిచాడు. ఓపెన్ ఎరాలో 22 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల తో తిరుగులేని టెన్నిస్ తారగా మన్ననలు పొందిన నాదల్..ఫ్రెంచ్ ఓపెన్‌పై చెరుగని ముద్రవేశాడు. అసలు ఎవరికీ సాధ్యం కానీ రీతిలో 14 టైటిళ్ల తో క్లే కింగ్ అన్న గౌరవాన్ని సొంతం చేసుకున్నాడు. రోజర్ ఫెదరర్, నొవాక్ జోకోవిచ్‌తో కలిసి బిగ్‌త్రీలో ఒకడైన నాదల్ లేని లోటు పూడ్చలేనిది.

> గత కొన్నేండ్లుగా భారంగా గడుస్తున్నది. ముఖ్యంగా గత రెండేండ్ల నుంచి గాయాలు వేధిస్తున్నాయి. రిటైర్మెంట్ అనేది కఠిన నిర్ణయమైనా.. జీవితంలో ఏదో ఒక సమయంలో వీడ్కోలు పలుకాల్సిందే. ప్రతీ దానికి ఆరంభం ఎలా ఉంటుందో.. ముగింపు కూడా ఉంటుంది.
>
> **- రఫెల్ నాదల్**

మాడ్రిడ్: ప్రపంచ టెన్నిస్‌లో ఒక శకానికి ముగింపు పడింది. క్రికెట్‌లో ఒక డాన్ బ్రాడ్‌మన్, సచిన్ టెండూల్కర్ ఎలాగో..టెన్నిస్ అనగానే వెంటనే గుర్తుకొచ్చే పేర్లలో రఫెల్ నాదల్ ఒకటి. జూలపాల జుట్టుతో 15 ఏండ్ల ప్రాయంలోనే ప్రొఫెషనల్‌గా కెరీర్ మొదలుపెట్టిన నాదల్ 38 ఏండ్ల వయసులో ఆటకు వీడ్కోలు పలుకుతున్నట్లు అనూహ్యంగా ప్రకటించాడు. గాయాలు నీడలా వెంటాడుతున్న వేళ తిరిగి నిలదొక్కుకునేందుకు అన్ని రకాలుగా ప్రయత్నించినా ఈ పోరాట యోధుని కెరీర్ కొనసాగ లేదు. ప్రపంచ టెన్నిస్ అభిమానులను ఒకింత షాక్‌కు గురిచేస్తూ నాదల్ సోషల్‌మీడియాలో వీడియో ద్వారా తన రిటైర్మెంట్ ప్రకటన వెలువరించాడు. నవంబర్‌లో జరిగే డెవిస్ కప్ ఫైనల్స్ తనకు చివరిదని పేర్కొన్నాడు. దేశం(స్పెయిన్) తరపున చివరిసారి ఆడబోతున్నట్లు తెలిపాడు. గతేడాది నుంచి రకరకాల గాయాలతో ఇబ్బంది పడుతున్న నాదల్..ఇటీవలే ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో స్పెయిన్ తరపున ప్రాతినిధ్యం వహించాడు. సింగిల్స్‌లో జొకోవిచ్ చేతిలో ఓడిన నాదల్..డబుల్స్‌లో కార్లోస్ అల్కారజ్‌తో కలిసి క్వార్టర్స్ వరకు పోరాడాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే అనూహ్యంగా వెనుదిరగిన నాదల్ ఇదే తనకు చివరి సీజన్ అంటూ ప్రకటించాడు. అన్నట్లుగానే తన సుదీర్ఘ కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెట్టాడు.

నాదల్ ప్రొఫైల్

పేరు:	రఫెల్ నాదల్ పెరెరా
పుట్టిన తేదీ:	జూన్ 3, 1986 (స్పెయిన్)
కెరీర్ రికార్డు:	1080-227(82.6%)
కెరీర్ టైటిల్స్:	92
గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు:	22
ఫ్రెంచ్ ఓపెన్	(2005, 06, 07,08, 10, 11, 12, 13, 14, 17, 18, 19, 20, 22)
యూఎస్ ఓపెన్:	2010, 13, 17, 19
ఆస్ట్రేలియన్ ఓపెన్:	2009, 2022
వింబుల్డన్:	2008, 2010
ఒలింపిక్స్:	సింగిల్స్(స్వర్ణం, 2008), డబుల్స్(స్వర్ణం, 2016)
డేవిస్ కప్:	(2004, 09, 11, 19)
ప్రైజ్‌మనీ:	135 మిలియన్ డాలర్లు

నాదల్ ఘనతలు

- అత్యధిక(14) సార్లు ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లు గెలిచిన ప్లేయర్‌గా నాదల్ రికార్డు నెలకొల్పాడు. 2005 నుంచి 14 వరకు పదింటిలో 9సార్లు టైటిల్ సొంతం చేసుకున్నాడు.
- 19 ఏండ్ల వయసులో నాదల్..తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ విజేతగా నిలిచాడు. ఈ క్రమంలో ఫెదరర్, మారియానో ప్యుయెర్టాను ఓడించి..సంప్రాస్ (15 ఏండ్లు) తర్వాత పిన్న వయసు గ్రాండ్‌స్లామ్ విజేతగా నిలిచాడు.
- 18 ఏండ్ల వయసులో(2004) డేవిస్ కప్ ఫైనల్లో అండీ రాడిక్‌ను ఓడించి స్పెయిన్‌కు టైటిల్ అందించడంలో కీలకమయ్యాడు.
- నాదల్, ఫెదరర్ మధ్య జరిగిన 2008 వింబుల్డన్ ఫైనల్ టెన్నిస్ చరిత్రలో గ్రేటెస్ట్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌గా నిలిచిపోయింది.
- 2010లో ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ గెలిచిన నాదల్..కెరీర్ గోల్డెన్ స్లామ్ పూర్తి చేసిన రెండో ప్లేయర్‌గా నిలిచాడు.
- బీజింగ్(2008) ఒలింపిక్స్‌లో నాదల్ తొలిసారి స్వర్ణం గెలిచాడు. ఫైనల్లో గొంజాలెజ్‌ను ఓడించి స్పెయిన్‌కు పసిడి అందించాడు.

రంజీ ట్రోఫీకి వేళాయె

నేటి నుంచి టోర్నీ ప్రారంభం ● గుజరాత్‌తో హైదరాబాద్ తొలి మ్యాచ్

న్యూఢిల్లీ: దేశవాళీ సీజన్‌లో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. శుక్రవారం నుంచి రంజీ ట్రోఫీకి తెరలేవనుంది. మొత్తం 32 జట్లు ఎనిమిదేసి జట్లతోనాలుగు గ్రూపులుగా విడిపోయి తలపడనున్నాయి. జాతీయ జట్టులో తిరిగి చోటు కోసం ఆశిస్తున్న శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్, అజింక్యా రహానే లాంటి క్రికెటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గత రంజీ సీజన్‌లో ఆడకుండా నేరుగా ఐపీఎల్ ఆడి బీసీసీఐ పెద్దల ఆగ్రహానికి గురైన అయ్యర్, ఇషాన్..ఈసారి తమ తమ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నిబంధనలు ఎవరికైనా ఒకటేనన్న బోర్డు పెద్దల ఆదేశాలతో అయ్యర్, ఇషాన్ దిగిరాక తప్పలేదు. అయ్యర్, రహానే, పృథ్వీషా లాంటి క్రికెటర్లతో డిఫెండింగ్ చాంప్ ముంబై పటిష్ఠంగా కనిపిస్తున్నది. ఖాన్ బ్రదర్స్(సర్ఫరాజ్, ముషీర్) కూడా చేరితే ముంబైకి తిరుగుండకపోవచ్చు. ఇక హైదరాబాద్ విషయానికొస్తే..తమ తొలి పోరులో గుజరాత్‌తో తలపడనుంది. గత సీజన్‌లో ప్లేట్ డివిజన్ విన్నర్‌గా నిలిచిన హైదరాబాద్..ఈసారి ఎలైట్‌లో సత్తాచాటాలని చూస్తున్నది. స్థానిక జింఖానా మైదానంలో ఇరు జట్లు తలపడనున్నాయి.

విండీస్ విజయం

షార్జా: మహిళల టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్‌బంగ్లాను చిత్తుగా ఓడించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో విండీస్ 8 వికెట్ల తేడాతో గెలిచి గ్రూపు-బిలో టాప్‌లోకి దూసుకొచ్చింది. బంగ్లా నిర్దేశించిన 104 పరుగుల లక్ష్యాన్ని విండీస్ 12.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ హీలీ మాథ్యూస్(34), స్టెఫానీ టేలర్(27) రాణించారు. నహీద, మరూఫా ఒక్కో వికెట్ తీశారు. తొలుత 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కరిష్మా(4/17) ధాటికి బంగ్లా 20 ఓవర్లలో 103/8 స్కోరుకు పరిమితమైంది. కెప్టెన్ సుల్తానా(39) టాప్ స్కోరర్.